క్లుప్తంగా

1,029వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు దీక్షలు గురువారం నాటికి 1,029వ రోజుకు చేరుకున్నాయి. సంస్థ డబ్ల్యూఆర్ఎం–1,2 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని నిరసన తెలిపారు. వీరికి సంఘీభావం తెలుపుతూ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీహెచ్ఈఎల్ నాయకులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలను అందించారు. 241 మందికి ఉచితంగా వైద్య సేవలను అందించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.వి.కృష్ణ, ఎస్.కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరాలు

గాజువాక: సన్‌రైజ్ చిన్న పిల్లల ఆస్పత్రికి సంబంధించిన అన్ని శాఖల్లోను ఈనెల 9, 10 తేదీల్లో చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు ఆ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతి తెలిపారు. తమ ఆస్పత్రి 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రైస్ కార్డు కలిగిన కుటుంబాల్లో చిన్న పిల్లలకు ఈ శిబిరాల్లో ఉచిత ఓపీడీ, ఉచిత రక్త పరీక్షలను నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం గాజువాక, కరాస, పరవాడ, సుజాత నగర్‌లలో గల తమ ఆస్పత్రులలో సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

ఆ ఉద్యోగిపై చర్యలకు ఆదేశం

అగనంపూడి: బోగస్ ఆర్ కార్డుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రపతి కార్యాలయం ఉక్కు మంత్రిత్వశాఖ తద్వారా ఉక్కు సీఎండీకి లేఖ పంపినట్టు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్నా రామ అప్పారావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఆర్‌కార్డు పొంది, తద్వారా ఉద్యోగం పొంది ఉన్నతోద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గతంలో అన్ని స్థాయిల్లోని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో రాష్ట్రపతికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తద్వారా ఆయన కార్యాలయం నుంచి ఉక్కు మంత్రిత్వశాఖకు, అక్కడి నుంచి ఉక్కు సీఎండీకి చర్యలు తీసుకోవాలని లేఖ పంపించినట్టు ఆయన పేర్కొన్నారు.

సమస్యలపై నేటి నుంచి ఉక్కు అధికారుల నిరసన

ఉక్కునగరం: జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉక్కు అధికారులు తమ సమస్యలపై శుక్రవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.2020 నుంచి పదోన్నతులు జారీ చేయాలని, 2021–22కు పీఆర్పీ చెల్లించాలని, క్వార్టర్లలో విద్యుత్ చార్జీలు సడలించాలని, మూడో పే రివిజన్ అమలు చేయాలని, 2017–19, 2021–22 సంవత్సర వ్యవధికి పెన్షన్ ఫండ్‌కు 9 శాతం జమ చేయాలన్న డిమాండ్లపై ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో పలుమార్లు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు కనబడలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన ప్రకటించనున్నారు. 10న విభాగాధిపతులకు డిమాండ్ల పత్రాన్ని అందజేయనున్నారు. అదే విధంగా ఈనెల 16న హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న కొవ్వొత్తు జంక్షన్ నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించనున్నామని సీ అధ్యక్షులు కాటం చంద్రరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి అదృశ్యం



భాను (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ) విభాగానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు ఆడారి భాను (28) బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించటం లేదు. ఎస్.కోటకు చెందిన భాను పెదగంట్యాడలో నివశిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం కాంట్రాక్ట్ కార్మికుడిగా చేరాడు. విభాగం నాలుగవ బాయిలర్ దగ్గర పనిచేసే భాను యథావిధిగా బుధవారం విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 12.15 సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. ఆ తర్వాత నుంచి అతను కనిపించలేదు. రాత్రి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. అతని కాల్ డాటా ఆధారంగా విచారణ కొనసాగిస్తామని సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ఇరువైపులా 'రక్షణ'

నాడు ఆకాశం మబ్బు పట్టిందంటే చాలు ఆందోళన మొదలయ్యేది.. మేఘం కురిసిందంటే చాలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని బిక్కుబిక్కుంటూ గడిపేవాళ్లు. తుపాన్ల పేరు వింటే గుండెలు గుభేలమనే దుస్థితి.. భారీ వర్షాలు కురిస్తే ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి.. గెడ్డలు పొంగిపోతాయని.. తమ ఇళ్లు ముంపులో చిక్కుకుంటాయనే భయం..నాటి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకవడంతో ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకునే పరిస్థితి ఉండేది.

నేడు ఎన్ని తుపాన్లు వచ్చినా ఫర్వాలేదు.. భారీ వర్షాలు కురిసినా భయం లేదు.. ఎందుకుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజల భవిష్యత్తుకు భరోసా లభించింది.



65వ వార్డు పరిధిలోని చాకలి గెడ్డకు కొత్తగా నిర్మించిన రక్షణ గోడ



65వ వార్డు పరిధిలోని బాపూజీ కాలనీలో కొత్తగా నిర్మించిన రక్షణ గోడ

- గెడ్డలకిరువైపులా గోడలు
- తగ్గిన ప్రమాదాలు, ముంపు భయాలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్ ప్రాంతంలో ఉన్న చాకలిగెడ్డ, బాపూజీ కాలనీ గెడ్డలో వర్షాలు పడితే చాలు వరద నీరు హోరున వస్తుంది.. అయితే వాటికి రక్షణ గోడలు లేకపోవడంతో ఆ వరద నీరు పొంగి ఇళ్లలోకి వచ్చేది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలన్నీ ముంపు బారిన పడేవి.. ఈ గెడ్డల్లో పూడికలు పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తేది.. అంతేకాకుండా ఆయా గెడ్డల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో అవి కాస్తా విష పురుగులు, పందులకు ఆవాసాలుగా మారిపోయేవి. గెడ్డలో నీటి ప్రవాహం వచ్చినపుడు అందులోని విష పురుగులు కూడా ఇళ్లలోకి వచ్చేసేవి..అంతేకాకుండా వీటికి రక్షణ గోడ లేకపోవడంతో అటుగా రాకపోకలు సాగించేవారు అందులో ప్రమాదవశాత్తూ పడిపోతూ గాయాలపాలయ్యేవారు. అలాగే జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు ప్రధాన గెడ్డ కూడా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించేది. పై నుంచి వచ్చే వరదనీరు పోటెత్తడంతో బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, ఎస్సీ కాలనీ, గాంధీనగర్ ముంపునకు గురయ్యేవి. ఆ నీరు వెళ్లే మార్గం లేక రోజుల కొద్దీ అక్కడే నిలిచి ఉండేపోయేది. దీంతో స్థానికంగా ఉంటున్న వారు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజల దుస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్ నుంచి కేఎల్ రావు నగర్ దోభీఖానాతో పాటు నేతాజీ కాలనీ నుండి బాపూజీ కాలనీ శ్మశాన వాటిక వరకూ రూ.99.23 లక్షలతో గెడ్డలకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించారు. దీంతో వర్షపునీరు సాఫీగా సాగిపోతోంది. ప్రజలను ముంపు బారి నుంచి తప్పించింది. గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే 76వ వార్డు పరిధిలోని నడుపూరు ప్రధాన గెడ్డకు రక్షణ గోడ నిర్మించేందుకు రూ.95.85లక్షలతో శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఈ పనులు చేపట్టనున్నారు.



ప్రమాదాలు లేవు



ఇక్కడి గెడ్డ ఇరుగ్గా ఉండేది.. వానొస్తే అసలు కనిపించేది కాదు. ఒకసారి ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఆ గెడ్డలో పడిపోయి గాయపడ్డాను. ఇప్పుడు కొత్తగా ఈ గెడ్డకు రక్షణ గోడలు కట్టారు. మా ఇంటికి వెళ్లేందుకు చిన్న వంతెన నిర్మించారు. ఇక దిగులు లేదు. దర్జాగా రాకపోకలు సాగిస్తున్నాం.

–బి.గురయ్య, చాకలిగెడ్డ, 65వ వార్డు

భయం లేకుండా బతుకుతున్నాం..



వర్షాలు వస్తే చాలు గెడ్డ పొంగిపోయేది. మా ఇళ్లలోకి వరద నీరు, పాములు, తేళ్లు వచ్చేవి. భయం భయంగా ఉండేవాళ్లం.. రాత్రుళ్లు నిద్ర లేకుండా గడిపేవాళ్లం. ఇప్పుడు గెడ్డకు గోడలు కట్టారు. ఆ దిగులు పోయింది. ఎంత పెద్ద వానొచ్చినా వర్షం నీరు ఇటువైపు రావడం లేదు. భయం లేకుండా బతుకుతున్నాం. –కుందనమ్మ, చాకలిగెడ్డ, 65వ వార్డు

నీరు సాఫీగా వెళ్లిపోతోంది..



ఈ గెడ్డ చుట్టూ వందలాది నివాసాలు ఉన్నాయి. గతంలో దీనిని నిర్లక్ష్యంగా వదిలేశారు. వర్షా కాలంలోనే వరద నీరే కాదు.. మామూలు రోజుల్లో కూడా మురుగు ప్రవహిస్తూ ఉండేది. ఆ నీరు పొంగి ఇళ్లలోకి వచ్చేసేది. ఇప్పుడు ఆ బెడద లేకుండా చర్యలు తీసుకున్నారు. ముంపూ లేదూ. మురుగు వాసనా లేదు. ఎగువ ప్రాంతం నుంచి ఎంత నీరొచ్చినా సాఫీగా వెళ్లిపోతోంది. మేము ఇక్కడ ప్రశాంతంగా ఉంటున్నాం.

–తాతారావు, బాపూజీ కాలనీ, 65వ వార్డు

జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి



జెండా ఆవిష్కరిస్తున్న గాజువాక వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవన్‌రెడ్డి



డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి

జనం కోరుకొంటున్న నేత జగన్

పెదగంట్యాడ: ఒక పక్క అభివృద్ధి మరో పక్క సంక్షేమ పథకాలతో పారదర్శక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని ఓల్డ్ అయ్యన్నపాలెం సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు తావులేకుండా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు జనం జేజేలు పలుకుతున్నారని చెప్పారు. ముందుగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలో 18 కోట్ల 85లక్షల 78 వేల 349 రూపాయలతో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, వెంపాడ అప్పారావు, గంట్యాడ గురుమూర్తి, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా..

గాజువాక: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని జనం కోరుకొంటున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 70వ వార్డు చిట్టినాయుడు కాలనీ సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధి డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల కోసం రూ.20కోట్ల 92 లక్షల 75 వేల 604ను కేటాయించారన్నారు. అర్హతే ప్రమాణికంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్, నాయకులు కొణతాల రాము, ఆచారి, మోహన్ కృష్ణ, భద్రం, జగన్నాథం, రమణ, రాజవరలక్ష్మి, వాసంతి పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌కే మద్దతు పలకాలి

అగనంపూడి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా జగన్ మళ్లీ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ గాజువాక ఇన్‌చార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం 85వ వార్డు బీసీ కాలనీ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, మండలం క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు బొద్ద గోవింద్, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్‌నాయకులు నక్కా రమణబాబు, పెదిరెడ్ల హరీష్, సాలాపు అచ్చిబాబు, నక్కా నాయుడు, యలమంచిలి అప్పారావు, గెద్దాడ రత్నం, ప్రమీల పాల్గొన్నారు.

సొంత ఇల్లు లేని అర్హులకు 15 మందికి ఇదే వేదికపై పట్టాలు అందించినట్టు దేవన్‌రెడ్డి చెప్పారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి

పెదగంట్యాడ: విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో శ్రీసూర్య జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎంపీ రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, చెడు మార్గాల వెళ్లవద్దన్నారు. బాగా చదువుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతి ప్రదర్శలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, గుడివాడ శ్రీనివాసరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, రామకృష్ణ, కృష్ణవేణి, రాజశేఖర్, నాయుడు పాల్గొన్నారు.

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లోను విస్తృత ప్రచారం చేస్తామని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. 67వ వార్డు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వార్డుల్లోను పోలింగ్ బూత్ కమిటీల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకర రావు, కె.నాగరాజు, మణి కుమార్, కె.రమణ, ఎల్.సత్తిబాబు, ఆర్.శంకరరావు, ఎస్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తం

అక్కిరెడ్డిపాలెం: డెంగ్యూ జ్వరాలపై చిన్న పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కడల్స్ హాస్పటల్ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నిఖిల్ తెన్నేటి అన్నారు. రెండు రోజులుగా గాజువాక పరిసరాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. దీనికి తోడు చలికాలం కావడంతో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 200 మంది పిల్లకు స్క్రీనింగ్, ఎత్తు, బరువు పరీక్షలు నిర్వహించారు. కిమ్స్ వైద్యులు శ్రీకాంత్, దివ్య, అహ్మద్, పాఠశాలల ప్రిన్సిపల్ రాధిక, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్‌అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిమం పెన్షన్ రూ.9వేలు ఇస్తూ, డీఏను అనుసంధానం చేయాలని కోరారు. పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు. అలాగే సంఘాన్ని బలోపేతం చేయాలని, పెన్షనర్లను సభ్యులుగా చేసుకోవాలని సూచించారు.

ఘనంగా కాలభైరవ విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టను నిర్వహిస్తున్న పీఠాధి శ్రవణా చైతన్యానంద చిన్న స్వామి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపు తుంగ్లాంలోని శివాలయం ప్రాంగణంలో కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతులు శ్రీ శ్రవణ చైతన్యానంద చిన్న స్వామి, శ్రీ దుర్గా మహా పీఠాధిపతులుతో కలిసి భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠను చేశారు. అనంతరం జరిగిన ప్రవచన కార్యక్రమంలో భక్తి భావాలను వివరించారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక ఇన్‌ఛార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, గ్రామ కమిటీ సభ్యులు సలాది అచ్చిబాబు, మజ్జి రాజు, కోన అప్పారావు, విరోతి అప్పారావు, విరోతి భవానీ శంకర్, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించొద్దు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెన నుంచి స్టీల్ ప్లాంట్ బీసీ గేటు వరకూ అనధికారికంగా పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని స్టీల్‌ప్లాంట్ అధికారులు హెచ్చరించారు. బీసీ రోడ్డులో అనధికార పార్కింగ్‌ను సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు రెండో రోజు స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ అధికారులు సహగల్, లలన్, హెచ్ఆర్ అధికారులు సంజీవరావు, శంకర్ గురువారం గంగవరం పోర్టు వంతెనను పరిశీలించారు. అనధికారికంగా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగింపజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



భాస్కరరావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో కణితి రోడ్డు జగ్గు జంక్షన్ వద్ద సైకిల్ వెళుతున్న భవానీమాలధారుడు మందల భాస్కర రావు(65)ను లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంజీవ్‌నగర్, బీసీ రోడ్డు పెదగంట్యాడకు చెందిన భాస్కర రావు ఓ స్క్రాబ్ దుకాణంలో పనిచేస్తున్నారు. ఉదయం విధులకు సైకిల్‌పై వెళ్తున్నాడు. జగ్గుజంక్షన్ వద్దకు వచ్చే సరికి గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో వస్తున్న లారీ సైకిల్‌పై వెళ్తున్న భాస్కరరావును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కరరావు అక్కడికక్కడే దుర్మరణం చెందాడన్నారు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు శంకర్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు విస్తరణ స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డీఓ



రోడ్డు విస్తరణపై గుడివాడ లతీష్‌తో మాట్లాడుతున్న ఆర్‌డీఓ హుస్సేన్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ నుంచి బొజ్జన కొండ మీదుగా గాజువాక హై స్కూల్ రోడ్డు వరకు వెళ్లే రోడ్డు విస్తరణ కొరకు ఏపీ ట్రాన్స్ కో చెందిన స్థలాన్ని పరిశీలనకు కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆర్‌డీఓ హుస్సేన్ విచ్చేశారు. గురువారం వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీ నుంచి 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్‌తో కలిసి ఆర్‌డీఓ హుస్సేన్ గాజువాక రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు, వీఆర్ఓలు, సర్వేయర్‌లతో కలిసి విస్తరణ జరగనున్న ప్రాంతాలను పరిశీలించి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, నాయకులు శ్రీహరి, గుర్రం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

గాజువాక: డెంగ్యూ జ్వరాలపై పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని చిన్న పిల్లల వైద్యుడు నిఖిల్ తెన్నేటి అన్నారు. వుడా కాలనీలోని ది కార్విన్ స్కూల్‌లో చిన్న పిల్లలకు రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పైగా చిన్నారులకు పరీక్షలను నిర్వహించారు. వైద్యులు శ్రీకాంత్, దివ్య, అహ్మద్, పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.